క్లుప్తంగా

పండ్ల తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



ఎద్దులదొడ్డిలో రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఏపీడీ పక్కీరప్ప

తుగ్గలి : పండ్ల తోటల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏపీడీ పక్కీరప్ప అన్నారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు పెంచే రైతులకు గురువారం మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో 600 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యం కాగా, ఇప్పటికే 338 ఎకరాల్లో 119 మంది రైతులకు పండ్ల తోటల పెంపకానికి అనుమతులు మంజూరయ్యాయన్నారు. తోటల పెంపకానికి ఉపాధి పథకం కింద మూడేళ్ల పాటు సాగు ఖర్చుల కింద రైతుల ఖాతాల్లోకే నేరుగా డబ్బులు జమ అవుతాయన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్లస్టర్ టీఏ గంగన్న, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం, టీఏలు వెంకప్ప, ప్రదీప్‌కుమార్ పరీదప్ప, రామకృష్ణ, రాజశేఖర్, చంద్రశేఖర్, జయరాముడు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో తహసీల్దార్ ఈరమ్మ, చిగిళిలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ,ములుగుందంలో పంచాయతీరాజ్ ఏఈ యమునప్ప గురువారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఆయా గ్రామాలలో అవసరమైన చోట్ల సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తుగ్గలి : గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ షర్మిల అన్నారు. శుక్రవారం గిరిగెట్లలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని పంచాయతీ కార్మికులు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల నివారణ మందును పిచికారీ చేశారు.ఈ పనులను తహసీల్దార్ పరిశీలించి మాట్లాడుతూ పారిశుద్ధ్యం లోపిస్తే రోగాల బారిన పడతారని పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆర్ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు రామలింగప్ప, రహిమాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలి



మద్దికెరలో పర్యటిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు

మద్దికెర : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నెలకొల్పాలని కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. గురువారం స్థానిక కాలనీలు, ప్రధాన రహదారులను సందర్శించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్ సుహాసిని ఉన్నారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శిగా సుధాకర్

మద్దికెర : స్థానిక మేజర్ పంచాయతీకి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా తనకు అదనపు బాధ్యతలు అప్పగించారని సుధాకర్ గురువారం తెలిపారు. ఇప్పటికే పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాల కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నానని, జిల్లా అధికారులు మద్దికెర బాధ్యతలు కూడా చూడాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అందరి సహకారంతో పంచాయతీలో విధులు నిర్వహిస్తానన్నారు.

సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వీఏహెచ్ ప్రసన్నబాయి తెలిపారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో ఉచిత గర్భకోశ వ్యాధుల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గేదెలు, ఆవుల కు చూడి పరీక్షలు చేశారు. పాడి శువులకు మినరల్ మిక్చర్, లివర్ టానిక్స్ తదిర మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పశువులు చూడి కట్టినప్పటి నుంచి ఈనే వరకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గోపాల్ మిత్రలు నారాయణ, నీలకంఠ పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో శిక్ష సప్తాహ్

హొళగుంద: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. హొళగుంద జెడ్పీ హైస్కూల్, చిన్నహ్యాట కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలలో కార్యక్రమాలు జరిగాయి. ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం, హెచ్‌ఎంలు నజీర్ అహమ్మద్, దొడ్డబసప్ప పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం

- గ్రామాల్లో లోపిస్తున్న శుభ్రత
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- తీవ్రంగా దోమల బెడద
- సమీక్షలతో సరిపెడుతున్న ఉన్నతాధికారులు

వర్షాకాలం.. వ్యాధులు ముసురుకునే ముప్పు ఉంది. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి, ఇళ్ల పక్కన దోమల నివారణ చర్యలు చేపట్టండంటూ అధికారులు ఉపన్యాసాలు ఇస్తున్నారే కానీ.. గ్రామాల్లో పేరుకుపోయిన మురుగు, డ్రైనేజీల్లో పూడికతీయడం లేదు. ఇక ప్రధాన రోడ్లపైనే మురుగు నీరు ప్రవహిస్తూ బురదమయమై, ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి.. పారిశుద్ధ్యం లోపించి పల్లెలు కంపుకొడుతున్నాయి. దోమలు విజృంభిస్తుండటంతో జనం వ్యాధులబారిన పడుతున్నారు. అయినా ప్రభుత్వ చర్యలు శూన్యం.

చిప్పగిరి: మండలంలోని అనేక పంచాయతీల్లో పారిశుద్ధ్యం లోపించింది. కేవలం ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు సందర్శించిన సమయాల్లో మాత్రమే పారిశుద్ధ్య పనులు చేసి బిల్లులు చేసుకోవడం పరిపాటిగా మారింది. మండల కేంద్రం చిప్పగిరితో పాటు మండలంలో 16 గ్రామాలు ఉన్నాయి.చాలా గ్రామాల్లోని కాలనీల్లో సీసీ రోడ్లు లేవు. వృథా నీరు, మురుగు రోడ్లపై నిత్యం కాలువలా ప్రవహిస్తుండటంతో రోడ్లు బురదమయమై కనీసం నడవడానికి కూడా వీలులేనట్లుగా మారిపోయాయి. ఇక సీసీ రోడ్లు ఉన్న గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు లేక పోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కావడంతో మురుగుకు వర్షపు నీరు తోడవుతుండటంతో దోమలు, ఈగల బెడద తీవ్రంగా మారింది. వీటితో వ్యాధులు ప్రబలే



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు (ఫైల్)

అవకాశముందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో విషజ్వరాలతో పలువురు ఇబ్బందులు పడుతున్నా వెలుగులోకి రావడం లేదు. పల్లెల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం, చెత్త తరలించకపోవడంతో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి



బెల్డోణలో తుప్పు పట్టిన చెత్త తరలించే ట్రైసైకిల్

మురుగు కూపాలుగా మారుతున్నాయి. అయినా పాలకులు, అధికారులు స్పందించడం లేదు.

సమీక్షలకే పరిమితమవుతున్న అధికారులు..

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులు మండలంలో సమీక్షలకే పరిమితమవుతున్నారు. రెండు మూడు నెలలకొకసారి ఆయా శాఖల ఉన్నతాధికారులు గ్రామాల్లో పర్యటించకుండా మండల కేంద్రంలోని అధికారులతో సమావేశాలు నిర్వహించి మమ అనిపిస్తుండటంతో సమస్యలు అపరిష్కృతంగా మారుతున్నాయి.

మురికి కూపంగా ములుగుందం

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామం మురికి కూపంగా మారింది. గ్రామంలోని బీసీ కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయకపోవడం వల్ల ఇళ్ల నుంచి వచ్చే వృథా, మురుగు నీరు, వర్షపు నీరు ముందుకు వెళ్లేందుకు వీలు లేక ఎక్కడిక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో దుర్గంధం వెదజల్లుతుండటంతో భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వర్షపు నీరు కూడా ఇళ్ల ముందే నిలిచిపోవడంతో నడవడానికి కూడ వీలులేకుండా ఉందని వాపోతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరిలేదని అసహనం వ్యక్తం చేశారు.









తేలిక పాటి వర్షానికే చిత్తడిగా మారిన సంచర్ల ప్రధాన రహదారి, నగరదోణలో స్వచ్ఛత బోర్డు కిందే చెత్త కుప్ప, ఏరూరులో ప్రధాన రహదారిపైనే మురుగు నీటి ప్రవాహం, ములుగుందంలోని బీసీ కాలనీలో....

విద్యార్థులకు అందని యూనిఫాం



చిప్పగిరి ఎమ్మార్సీ భవనంలో నిల్వ ఉన్న యూనిఫాం బస్తాలు

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్, షూ, యూనిఫాం తదితర కిట్ మొత్తం అందించేవారు. కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభమై నెలన్నర రోజులు గడిచినా విద్యార్థులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అందాల్సిన సామగ్రి అందలేదు. యూనిఫాం మండల కేంద్రానికి చేరి వారం రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులు పాఠశాలలకు సరఫరా చేయకపోవడంతో స్థానిక ఎమ్మార్సీ భవనంలో మగ్గుతున్నాయి. మండలంలోని 25 పాఠశాలలో మొత్తం 3,167 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. యూనిఫాం అందకపోవడంతో పాత యూనిఫాంలోనే విద్యార్థులు బడులకు హాజరవుతున్నారు. ఇప్పటికైనా యూనిఫాం అందజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కదిరే కృష్ణను అరెస్ట్ చేయాలి

పత్తికొండ రూరల్ : హిందువుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వరస్వామి సుప్రభాత సేవను కించపరిచేలా మాట్లాడిన కదిరే కృష్ణను వెంటనే అరెస్టు చేయాలని విశ్వహిందూ పరిషత్ నియోజకవర్గ అధ్యక్షుడు వీరరాజు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గోవర్ధన్ డిమాండ్ చేశారు. అభ్యంతర కరమైన మాటలను ఖండిస్తూ గురువారం పత్తికొండ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ ప్రముఖ్ రామలింగయ్య, మన్‌కిబాత్ కోకన్వీనర్ కరణం నరేష్, నాయకులు పూనామల్లికార్జున, శంకరయ్య, ధార్మిక సంస్థ సోమన్న, ఉపేంద్ర పాల్గొన్నారు.

అధిక సాంద్రతలో పత్తి సాగు మేలు

వెల్దుర్తి(కృష్ణగిరి): నీటి తడితో పదునైన అధిక సాంద్రత కలిగిన భూమిలో పత్తి పంట సాగు మేలని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం వెల్దుర్తి మండలంలోని రామళ్ల కోట గ్రామంలో బాగాని మాసూం వలి రైతు పొలంలో పత్తి పంట విత్తు, అంతర్ పంటల విత్తు కార్యక్రమాన్ని డీటీసీ కర్నూలు ఏడీఏ వెంకటేశ్వర్లు, ఆత్మ కర్నూలు వ్యవసాయాధికారి మధుమతి, స్థానిక ఏఓ అక్బర్‌బాషా, ప్రకృతి వ్యవసాయశాఖ సబ్ డివిజనల్ అధికారి మాబువలితో కలిసి నిర్వహించారు. ముందుగా అధిక సాంద్రతతో కూడిన రైతు పొలంలో పత్తి విత్తనాల నాటించారు. ఆయన మాట్లాడుతూ ఈ విధానంలో పంటలో గులాబీ రంగు పురుగ ఉధృతి తగ్గించవచ్చన్నారు. అధిక దిగుబడితో పాటు సంవత్సరానికి రెండు పంటలు పండించవచ్చని చెప్పారు. ఎకరాకు దాదాపు 15వేల మొక్కలతో పత్తి పంట సాగు చేయవచ్చన్నారు. అదే రైతుకు చెందిన కంది పంట సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు పంటల (అంతర్‌పంట)



రామళ్లకోటలో పత్తి సాగు చేయిస్తున్న అధికారులు

విధానంలో భాగంగా పొద్దుతిరుగుడు, అలసంద, పెసలు, మినుములు, అనుములు, సజ్జలు, జొన్నలు తదితరాల విత్తన మిశ్రమసాగును ప్రకృతి వ్యవసాయాధికారులతో కలిసి బీజామృతంతో విత్తన శుద్ధి చేసి వేయించారు. ఒకే పంట కంటే పలు అంతరపంటల సాగుతో నష్టాలను తగ్గించవచ్చన్నారు. అనంతరం రామళ్లకోట రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో సమావేశమై వ్యవసాయ పథకాలపై సమీక్ష నిర్వహించారు. రైతులు, వీఏఏ సాంబశివుడు, ఐసీఆర్‌పీ రాఘవేంద్ర ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి: ఎస్సీ,బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలన అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా హాస్టళ్లలో వార్డెన్లు, కుక్, కమాటి, వాచ్‌మెన్లు ట్యూటర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈశ్వర్, ఆశోక్, నరేష్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

హాలహర్వి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ఉలిగమ్మ గ్రామస్తులకు సూచించారు. గురువారం మండలంలోని గూళ్యం గ్రామంలో దోమల, ఈగల నివారణకు యాంటీ లార్వా లిక్విడ్‌ను ట్రాక్టర్ సాయంతో వీధుల్లో పిచికారీ చేయించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెదేహాల్‌లో పెద్దసరిగెత్తు

హాలహర్వి: మండలంలోని మెదేహాల్ గ్రామంలో సోమవారం కొడు పీర్లు కొలువుదీరాయి. గురువారం పీర్లచావిడి నిర్వాహకులు పెద్ద సరిగెత్తు నిర్వహించారు. భక్తులు పీర్లచావిడి చేరుకుని పీర్లకు ప్రత్యేక ఫాతెహాల్ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పంటల సాగుపై అవగాహన

ఆలూరు: సన్న, చిన్న కారు రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను గడించాలంటే శాశ్వత పెండల్ పంటల సాగుపై దృష్టి సారించాలని హార్టికల్చర్ అధికారిణి ఇందిర తెలిపారు. గురువారం ఆలూ రు, హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామాల్లో రైతులు ఉలిగప్ప, బాబురావు సాగుచేసిన అంజూర, పందిరి బీర పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె ఆలూరులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోరు బావులున్న రైతులు శాశ్వత పందిరి వేసుకొని తీగ జాతి పంటలను సాగు చేస్తే రైతులకు రూ.లక్ష వరకు ప్రభుత్వం రాయితీ, డ్రిప్, లేదా, సిమెంట్ స్తంభాలను నాటుకోవడానికి సహాయం అందజేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు 50 మందికి పైగా 20 రకాలుగా ఆకుకూరలు, కూరగాయాలు, పండ్ల తోటలు రైతులు సాగుచేస్తున్నారని చెప్పారు.

నిందితులపై కేసు నమోదు



రెహమాన్‌ను పరామర్శిస్తున్న బొమ్మన రవిరెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రెహమాన్‌పై దాడి చేసిన ఘటనలో గిడ్డయ్య, రమేష్, అయ్యస్వామి, బషీర్, మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ గురువారం తెలిపారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రెహమాన్‌ను వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి పరామర్శించి భరోసానిచ్చారు. బాధితుడి తల్లి రమీజాబీ మాట్లాడుతూ.. ఎడమ చేయి రెండు చోట్ల విరిగిందని, కాలు పరిస్థితి మరికొంత చికిత్స అనంతరం తెలియజేస్తామని వైద్యులు తెలిపారని చెప్పారు.

చెత్త నిర్వహణపై అవగాహన



బొమ్మిరెడ్డిపల్లెలో చెత్త నిర్వహణపై మహిళకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

వెల్దుర్తి(కృష్ణగిరి): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో చెత్తకుప్పలు ఉండదాదని డీఎల్‌పీఓ తిమ్మక్క అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.గురువారం ఆమె ఈఓఆర్డీ నరసింహులుతో కలిసి మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె, మదార్‌పురం గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించి ట్యాంకుల శుభ్రత గురించి అడిగితెలుసుకున్నారు.ప్రజలకు చెత్తనిర్వహణపై అవగాహనకల్పించారు. సెక్రటరీలు గురుస్వామి, ఉమ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చిన్నసరిగెత్తు

తుగ్గలి : మొహర్రంలో భాగంగా పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో గురువారం చిన్నసరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు చావిడిలో కొలువుదీరిన పీర్లను దర్శించుకుని చక్కెర చదివించి మొక్కులు చెల్లించు కున్నారు. రాత్రి పీర్లను గ్రామంలో ఊరేగించారు.



పెండేకల్లు రైల్వే జంక్షన్ చావిడిలో కొలువుదీరిన పీర్లు

ప్రజలకు జవాబుదారీగా పనిచేయండి

ఆలూరు: ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ విధులు నిర్వహించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని ఇక్కడ విధులు నిర్వహించడం తమకు కష్టతంగా మారిందని.. రెవెన్యూ సిబ్బంది జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, డీఆర్వో మధుసూదనరావు తదితర శాఖలకు చెందిన అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నూతన భవనం కేటాయింపు కోసం ఎంపీడీఓ సమావేశభవనం, స్త్రీశక్తి భవనం, సచివాలయం -2 తదితర కార్యాలయాలను గురువారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోనున్న సమావేశ భవనం తహసీల్దార్ కార్యాలయానికి అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు. అయితే ఈ భవనంలో ప్రస్తుతం ఉపాధి హామీ పథకం కార్యాలయం కొనసాగుతుంది. మూడు



ఆలూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్డీఓ రామలక్ష్మి

రోజుల్లోగా ఖాళీచేసి రెవెన్యూ అధికారులకు అప్పగించాలని డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి సూచన మేరకు ఏపీఓ శ్రీనివాసులు అంగీకరించారు. ఏపీఓ కార్యాలయాన్ని సమీపంలోని సచివాలయం -2లోకి మార్చుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తహసీల్దార్ చంద్రశేఖరయ్య, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఆర్ఐ బసన్నగౌడు,డీటీ రజనీకాంత్‌రెడ్డి, ఎన్నికల డీటీ గుండాలనాయక్, సివిల్ సప్లయిస్ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ బలరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు సామాజిక తనిఖీ బహిరంగ వేదిక

దేవనకొండ: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ వేదిక కార్యక్రమం ఈనెల 27వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఇద్రూష్‌బాషా గురువారం తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ, హౌసింగ్, పంచాయతీరాజ్, సోషియల్ ఫారెస్ట్, డీఆర్‌డీఏ, వెటర్నరీ, వాటర్‌షెడ్, విద్యాశాఖల్లో జరిగిన అభివృద్ధి పనులపై ఇప్పటికే సామాజిక తనిఖీలు చేపట్టారన్నారు. వీటిని బహిరంగ వేదిక ద్వారా వెల్లడిస్తామని చెప్పారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్ర బృందం

మద్దికెర : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గత నెలలో మృతి చెందిన తమ స్నేహితుడు వన్నూర్ వలి కుటుంబానికి గురువారం రూ.50,500 అందజేశారు. మాతో పాటు కలిసి చదువుకున్నాడని, తమ మిత్రుడు మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా నిలవాలని బాధ్యతగా భావించి కొంత సాయం చేశామని చెప్పారు.

పత్తికొండ మహిళకు డెంగీ



రాజీవ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

పత్తికొండ రూరల్ : పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలోని ఓ మహిళకు డెంగీ నిర్ధారణ అయ్యింది. అప్రమత్తమైన వైద్య,ఆరోగ్య, శాఖ అధికారులు గురువారం కాలనీలో ఇంటింటికీ జ్వర పరీక్షలు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మద్రిస్వామి పంచాయతీ సిబ్బందితో కాలనీలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు చేశారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ నర్స్ గంగరత్న, హెల్త్ సూపర్‌వైజర్‌లు ప్రకాష్, వరలక్ష్మి పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని ఎల్ నగరం గ్రామంలో ఈనెల 16న భార్య, అత్తపై హత్యాయత్నం చేసిన భర్త, అతడి తండ్రిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనా ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని, తక్షణం వారిని అరెస్ట్ చేయాలని కోరారు. ఆమె మాట్లాడుతూ.. ఎల్ నగరం గ్రామానికి చెందిన మధు విక్రమ్ (సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్) అదే గ్రామానికి చెందిన తన మేనత్త కూతురు, అంగన్‌వాడీ ఆయా బంగారు జయలక్ష్మిని పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు. తన భార్యపై అనుమానంతో మధువిక్రమ్, కట్నం తేలేదనే కోపంతో మామ మధుకృష్ణ, అత్త, చిన్నత్త.. జయలక్ష్మిని వేధించారన్నారు. వేధింపులు తాళలేక జయలక్ష్మి 2023 అక్టోబరులో పోలీసులకు ఫిర్యాదు చేయగా జీర్ణించుకోలేని వారు దాడులు తీవ్రం చేశాన్నారు. ఈనెల 16న జయలక్ష్మి, ఆమె తల్లి గోరంట్లమ్మపై హత్యాప్రయత్నం చేయగా తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. బాధితులు వెల్దుర్తి పోలీసులను ఆశ్రయించగా నిందితులపై కేసు నమోదు చేశారని, నాటి నుంచి చర్యలు లేవన్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలతో కలిసి ఏఎస్ఐ బాలకృష్ణను కోరారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

ఆలూరు రూరల్: కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు కర్నూలు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించి, పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేయించారు. ఆయన మాట్లాడుతూ పట్టుబడిన 8 వాహనాలకు ప్రభుత్వం రూ.1,02,400 నిర్ణయించగా.. వేలం పాటదారులు రూ. 1,79,950కు పాటదారులు దక్కించుకున్నట్లు చెప్పారు. ఇందులో జీఎస్టీ రూ. 27,450 ఉందన్నారు. అలాగే 125 కేసుల్లో పట్టుబడిన 3,145 లీటర్ల కర్ణాటక మద్యం, 15 లీటర్ల నాటు



వాహనాలు వేలం వేస్తున్న ఆలూరు సెబ్ పోలీసులు

సారాను మొలగవల్లి రోడ్డులో ధ్వంసం చేయించామన్నారు. ధ్వంసం చేసిన మద్యం విలువ రూ.12.50 లక్షలు ఉంటుందని చెప్పారు. ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్ సిబ్బంది శ్రీనివాసులు, విజయుడు,చంద్రన్న, రామలింగమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట గ్రామానికి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ, దస్తగిరి, నాయకులు గురువారం ఆదోని ఆర్టీసీ డీఎం మహ్మద్ రఫీకి వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు పెద్దహ్యాట నుంచి హొళగుందకు కాలినడకన వస్తున్న విద్యార్థులను కలిసి సమ్యస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పెద్దహ్యాట నుంచి హొళగుందలోని విద్యాలయాలకు దాదాపు 40 మంది విద్యార్థులు వస్తుంటారని వారికి బస్సు సౌకర్యం కాలినడకన



పెద్దహ్యాట నుంచి హొళగుందకు కాలినడకన వస్తున్న విద్యార్థులు

రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. స్పందించి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సతీష్‌కుమార్, మల్లి ఉన్నారు.

ఎల్లెల్సీలో తగ్గిన నీరు

హొళగుంద: బాపురం సెక్షన్‌లోని తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) 158 కి.మీ మైలురాయి వద్ద ఉన్న అండర్ టన్నెల్‌కు ఏర్పడిన లీకేజీ కారణంగా కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. గట్టు లోపలి భాగంలో బిలం మాదరిగా ఏర్పడి అందులో నుంచి కాలువ నీరు యూటీలోని రంధ్రాల ద్వారా బయటకు వెళ్తున్న విషయం తెలుసుకున్న టీబీ బోర్డు అధికారులు కాలువలో నీటిని వంకలోకి మళ్లించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు మొదలు పెట్టారు. టీబీ డ్యాంలో నీటి చేరిక ఆశాజనకంగా ఉండడం, ఇటీవల ఎల్లెల్సీకి నీరు విడుదల చేయడంతో ఆంధ్రా ఆయకట్టు రైతులు వరిసాగుకు



హొళగుంద 183 కి.మీ వద్ద తగ్గిన నీటి ప్రవాహం

సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో గండి పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక దిగువ కాలువలో 135 కి.మీ నుంచి ఆంధ్ర కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద కూడా నీటిమట్టం జీరో క్యూసెక్కులకు పడిపోయినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.